# మానివేసిన కథ

"పరా: ఇందలి పాత్రలు కేవలం కల్పితాలు. ప్రత్యేకంగా యేవ్యక్తికీ సంబంధించినవి కావు.

*N. G. O* ఆర్ముగం అయ్యరు కలెక్టరు ఆఫీసులో గుమాస్తా. 80 రూపాయలజీతం. వయస్సు సుమారు యాభైసంవత్సరాలుంటాయి. ముగ్గురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు అతనికి గల సంతానం. భార్య పట్టమ్మాళ్ నాలుగేళ్ళక్రితం చనిపోయింది. అతిదుఃఖంతో ఆర్ముగం అయ్యరు, అతని ముసలితల్లి పిల్లల్ని పెంచుకుంటూ వచ్చారు.

తలిపోరు పడలేక పెద్దపిల్లకు పెళ్లిచేశాడు. ఎంత క్లుప్తంగాచేసినా వెయ్యిరూపాయలైంది పెళ్లిఖర్చు. ఇంత ఖర్చుచేసినా వియ్యాలవారిని తృప్తిపరచలేకపోయాడు. వారికి మోహంయుడుపుగానే వుంది. పెద్దపిల్ల పెళ్లిచేసిన మరుసటి సంవత్సరమే తల్లి కాలంచేసింది. పాపం ఆర్ముగం అయ్యరు, పిల్లలు దిక్కులేనివాళ్ళయారు.

ఆర్ముగంఅయ్యరు చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. అతని పోషణభారం తల్లి మీదపడింది. ఆమె యింటింటికీ వెళ్లి చందాలుపోగుచేసి కొడుకును పెంచి,విద్యావంతుణ్ణి చేసింది. అంత కష్టపడి పైకి తీసుకువచ్చిన తల్లికి ఒక్కగానొక్క కొడుకైన తను ఆమె పరలోకక్రియలు గొప్పగా నిర్వర్తించాలి. రెండువందలు ఖర్చుచేశాడు.

పిల్ల పెళ్లికి, తల్లి అంత్యక్రియలకు నోటు రాసి అప్పుతెచ్చాడు. వియ్యాలవారిని పండగలకు తీసుకురావాలి. పెద్దపిల్లవాడు ఇంటరు చదువుతున్నాడు. మరోయిద్దరు పిల్లలు హైస్కూలుక్లాసులు చదువుతున్నారు. వీరందరికీ నెలనెలా జీతాలు కట్టాలి. పుస్తకాలు కొనాలి. ఖర్చు భరించలేక ఆఖరిపిల్లలిద్దరినీ స్కూలికి పంపకుండా తీరుబడి అయినప్పుడు తనే పాఠాలు చెప్పుకుంటున్నాడు.

పట్నవాసం కాపురం. తెచ్చేజీతం అందరికీ భోజనానికే చాలడంలేదు పైనియేఖర్చు వచ్చినా అప్పుచేసి తీరవలసిందే. వెంటనే తీరుద్దామనే సదుద్దేశంతోనే అప్పు తెచ్చేవాడు. అయినా జీతం వచ్చేటప్పటికికానీ మిగిలేది కాదు. రెండవతేదీనే భిక్షాధికారిగా తయారయేవాడు. అప్పు యెలా తీర్చడం? ప్రతీనెలా యీ విధంగానే జరిగేది. తీర్చవలసిన బాకీ తడిసిమోపెడయింది. అప్పు తలుచుకున్నప్పుడల్లా వొళ్లు ఝల్లుమనేది. రాత్రి నిద్రపట్టేది కాదు. చాలా బాధపడేవాడు.

ఏడాదినుండి అద్దె కానీకూడా యివ్వలేదు.

"నీ పెద్దల ఆస్తి అనుకున్నావా? ఇవ్వవలసిన సొమ్ము మర్యాదగా యిచ్చెయ్యి" అనే యిల్లుగలాయనమాటలు ఖాతరు చెయ్యకుండా గడిపేస్తున్నాడు. ఓనాడు ప్రొద్దున్నే యిల్లుగలాయన వచ్చి యిరుగుపొరుగు పెద్దమనుష్యులను పిలిచి "అయ్యా, చూశారా యీ అన్యాయం. ఏడాది అద్దె యివ్వాలి. రోజూ తిరిగి పోతున్నానేకాని ఒక్క నెల అద్దె అయినా యిచ్చిన పాపాన పోలేదు. ఇవ్వగలిగితే వుండాలి. లేకపోతే యింట్లోంచి వెళ్లిపోవాలిగాని యిలా చెయ్యడం బాగుందా?" అని నడివీధిలో కేకలు మొదలుపెట్టాడు. ఆవచ్చినవారంతా అతని మాటలు సబబే అన్నట్లు తలూపారు.

"అయ్యా, అద్దె యివ్వకపోవడము తప్పే. కొంతైనా యిచ్చిపంపుదామంటే చేతిలో యెర్రని యేగానీయైనా లేదు." అన్నాడు ఆర్ముగం అయ్యరు తలవంచుకుని.

"అద్దె కావలసే యిళ్లు అద్దెకిచ్చుకుంటారుగాని హాయిగా అనుభవించలేక కాదు" అని కొందరన్నారు.

"నీలాగేసొమ్ము అవసరంకాదా అందరికీను?" అన్నారు మరి కొందరు.

"అంత యిచ్చుకోలేనివాడివైతే యిల్లు ఖాళీచేసి యే సత్రంలోనైనా వుండరాదూ?" అన్నారు యింకా కొందరు.

"అయినా అరవవాడిని నమ్మకూడదు బాబూ" అన్నాడొక ముసలాయన. అంతా తలోరకంగా అనేటప్పటికి ఆర్ముగం అయ్యరు చాలా బాధపడ్డాడు. అభిమానధనుడవడమువల్ల శిరచ్ఛేదం జరిగినట్లుభావించాడు. "ఇలాంటి బ్రతుకు బ్రతకవలసివచ్చిందే" అని లోలోపల కుమిలిపోయాడు. "ఈ సాయంత్రమే మీ యిల్లు ఖాళీచేసేస్తాను. సొమ్ము సాధ్యమైనంత త్వరలో తీర్చేస్తాను" అని యిల్లుగలాయనకు, అక్కడి జనానికీ నచ్చచెప్పేసరికి పెద్దలు దిగివచ్చారు.

అన్నప్రకారం ఆ సాయంత్రమే యిల్లు ఖాళీచేసి వూరిచివరి సత్రంలో కాపురం పెట్టాడు ఆర్ముగం అయ్యరు. రాత్రి పన్నెండు గంటలయింది. సంరక్షణ లేకపోవడంవల్ల చిక్కిసగమై, చింపిరితలలతోను, మాసినబట్టలతోను పిల్లలంతా నిద్రపోతున్నారు గాఢంగా. ఆర్ముగంఅయ్యరు పడుకున్నవాడు గభీమని లేచి కూర్చున్నాడు పక్కమీద. అతని మనస్సు మనస్సులో లేదు. అమావాస్యరోజవడంవల్ల బయటఅంతా అంధకారం ఆవరించింది

"ఆర్ముగంఅయ్యరుచేత ఆత్మహత్య చేయించడమా? పరారీ చేయించడమా? చిన్నప్పుడు తల్లి వేయించిన లాటరీతాలూకు డబ్బు వచ్చినట్లు చెయ్యడమా? ఇక ముందుకథ యెలాగా నడిపించడం?" అని ఆలోచనలో పడ్డాను.

అవతల యెండ చాలా యెక్కువగా వుంది. కిటికీలోంచిమాత్రం గాలి బాగా వస్తోంది. బద్ధకంగా వుంది. టేబిల్ మీద గడియారం చూశాను. 12 గంటలైంది. ఆవలింతలు వరుసగా వస్తున్నాయి. కాస్సేపు పడుకుని లేచాక కథ పూర్తి చెయ్యవచ్చు అనుకున్నాను. "అమ్మా, నీ చేతిలో కాగితాలు మా కివ్వవూ పడవలు కట్టుకుంటాం" అని అడుగుతున్నారు మా చిన్న పిల్లలిద్దరూ. "అవి యిచ్చేవికావు వాటిమీద కథ రాస్తున్నాను" అని సమాధానం చెప్పి అక్కడే యీజీఛైర్ లో పడుకున్నాను. బల్లమీది కాగితాలు గాలికి టపటప కొట్టుకుంటున్నాయి.

చెయ్యెత్తు మనిషి. చామనచాయ. విశాలమైన నుదురు. గోల్డుగోల్డుఫ్రేము కళ్ళజోడు. తల ముందుభాగం నున్నగా వుండి, వెనక తిలతండులన్యాయంగా సగంసగం నెరసిన జుట్టుముడి. గూడకట్టు. హాఫ్ షర్టు వేసుకున్నాడు. పైన అంచులేని ఓ తెల్లకండువా. చేతిలో సంచీ. వచ్చి యెదురుగా నిలబడ్డాడు.

"ఏవరు నువ్వు?"

"దోషిగా ప్రప

థంలో పేరు పొందబోతున్న ఒక అభాగ్యుణ్ణి."

"నీ పేరు ?"

"నా పేరే తెలియదా ! తెలిసికూడా తెలియనట్లడుగుతున్నావే !"

"నిజంగా తెలియదు."

"తెలియందే కథ యెల్లారాస్తున్నావు?"

"ఏమిటీ! నా కథలోని ఆర్ముగంఅయ్యరువా నువ్వు ?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"కాక మరెవరనుకున్నావు? ఆ అభాగ్యపు ఆర్ముగం అయ్యరును నేనే."

"అయితే యెందు కిక్కడికి వచ్చావు?"

"నాజీవితం దుర్భరం చేశావని చెప్పడానికి."

"నే నేదో కథ రాసుకుంటుంటే నీగొడవేమిటి మధ్య ?"

"మధ్య నా గొడవ యేమిటి ? మొదటినుండి చివరిదాకా నాగొడవే."

ఆర్ముగం అయ్యరుచేత ఆత్మహత్య చేయించాలో లేక పరారీ చేయించాలో తెలియక నిద్రపోతున్న రచయిత్రికి ఆర్ముగం సాక్షాత్కరించాడు.



"వెంటనే యిక్కడినుండి వెళ్లిపో" అన్నాను గట్టిగా. ఎదటివ్యక్తి కదలలేదు సరికదా మళ్లీ మాట్లాడ్డం ప్రారంభించాడు.

"నాజీవితానికీ నీకథకీ యెంత తేడా వుందో తెలుసా ?"

"నువ్వెవరో, నీజీవితం యేమిటో యెరగను. నీ బ్రతుక్కీ నాకథకీ వున్న తేడా అంతకన్న యెరగను" అన్నాను విసుగు పడుతూ.

"అయితేనే చెబుతాను విను. నిజంగా నాకు ముగ్గురే సంతానం. ఆరుగురు పిల్లలున్నారని నీకథలో కంటకంగా వ్రాశావు. వీధిగుమ్మం యెలాంటిదో యెన్నడూ యెరగని మా అమ్మని యింటింటికీ పంపి చందాలు పోగుచేయించావు నాకోసం. నాభార్య కుష్టిమ్మార్ల నిక్షేపంలాగ వుంటే నీకథలో ఆమెని చంపేసి పిల్లల్ని తల్లిలేనివాళ్ళని చేశావు. మీ ఆంధ్రులలాగ దూబర తిండి తినకుండా సాంబారు అన్నంమాత్రమే తిని యెవ్వరికీ దమ్మిడీ అయినా యివ్వాలని అనిపించుకోకుండా గుట్టుగా కాలక్షేపం చేస్తున్నాను. అలాంటివాడిని అప్పులపాలుచేసి నడివీధిలో నలుగురిచేత కేకలెట్టిస్తావా ? ప్రతినెలా ఒకటోతారీకున అందరిబాకీలు తీర్చేవాడికి నిలవనీడ లేకుండా చేసి సత్రంలో కాపురం పెట్టిస్తావా ? ఇవన్నీ చాలక నాచేత పరారీ చేయించనా ? ఆత్మహత్య చేయించనా ? అని ఆలోచిస్తున్నావా ?" అన్నాడు.

స్తంభించిపోయాను ఆ మాటలకి. నీళ్ళతో నిండిన అతని కళ్లు చూస్తే జాలి వేసింది. నేనేం మాట్లాడలేదు.

'ఇలాంటి ఆధారం లేని వ్రాతలు వ్రాయాలని నీకెల్లా తోచింది ?" అని గద్దించి అడిగాడు.

"అనవసరంగా బాధపడుతున్నావు. కథ మొదట్లో "షరా" వుంది. "ఇందలి పాత్రలు కేవలం కల్పితాలు. ప్రత్యేకంగా యే వ్యక్తికీ సంబంధించినవి కావు" అని వ్రాశాను. చూడలేదా ? నీమాటలు వింటుంటే నవ్వొస్తోంది. పత్రికకు పంపుదామని నేనేదో కథ వ్రాస్తున్నాను. అందులో వ్రాసిన సంగతులన్నీ ఏ ఒక్కరివో కావు. రెవెన్యూడిపార్టుమెంటులో వున్న సుబ్రహ్మణ్యంగారికి ఆరుగురుపిల్లలు. ఆయన కీమధ్యే భార్యావియోగం కలిగింది. ఆ విషయం కథలోకి తీసుకున్నా, అప్పులు యెగవెయ్యడం, సత్రంలో చేరడం మావూళ్ళో వెంకన్నగారి సంగతి. మా వెనకవీధిలోని నరసింహంగారి తల్లి చందాలు పోగుచేసి ఆయన్ను పోషించింది. ఆ సంగతి తీసుకున్నాను. ఇల్లాగే తెలిసిన నాలుగు సంగతులు తీసుకుని అవసరమైతే కొంత కల్పించి వ్రాశాను. లోకానికి మీ N. G. Oలమీద సానుభూతి కలగడానికి వ్రాశా నీకథ." అన్నాను. మనిషి కొంత సమాధానపడ్డట్టు కనబడ్డాడు.

"అయితే సాటిఆంధ్రుల పేరు పెట్టక అరవ పేరు పెట్టడంలో నీ వుద్దేశమేమిటి ? అరవవారిని అవహేళన చేశానని ఆనందిస్తున్నావా ? ఆంధ్రులు అరవలు అనే ప్రాంతీయభేదం సామాన్య జనానికి వుంటే వుండవచ్చును. కాని, మా N. G. Oలకా ప్రాంతీయభేదం లేదు. ఎక్కడెక్కడివారైనాసరే N. G. Oలమంతా ఒక్కటే. గవర్నమెంటు వుద్యోగులు అనే పదమే తేడా కాని శ్రీశ్రీ యో యెవరో చెప్పినట్లు "గనిలో, వనిలో, కార్ఖానాలో పాటుపడే దౌర్భాగ్య జీవులూ మేమూ ఒకటే. మాకు ఫలితం తక్కువ. ఏవిధమైన గౌరవానికీ అర్హులం కాము."

"కథలో ప్రధానపాత్రకు పేరుపెట్టవలసివచ్చింది. ఏపేరు పెట్టనా అని ఆలోచించాను. చాలా పేర్లు స్ఫురించాయి. అవన్నీ వెనక నేను వ్రాసిన కథల్లో పెట్టిన పేర్లే. "ఆరుముగంఅయ్యరు" అన్న పేరుతోచగానే యీపేరు క్రొత్తది కదా అని యీ కథానాయకుడికి ఆ పేరు పెట్టాను."

"సరేలే. పోనీ పేరుపెడితే పెట్టావు కాని, అన్ని బాధలూ ఒక్కడికే తెచ్చిపెడితే యెల్లా బ్రతుకుతాడనుకున్నావ్ ? పోనీ కథ సుఖాంతం చెయ్యడానికి చూడరాదూ ?"

"అల్లా దార్లోకి వచ్చి అడిగితే చెబుతాను. నువ్వు మాంధాతపుట్టకలనాటివాడివిలాగ వున్నావు. మన భారతీయులు ఒరులకష్టాలు, బాధలు సహించలేని దయార్ద్రహృదయులు. కథలెంతసేపూ సుఖాంతంగావుండాలని అభిలషించేవారు. అందుకే మన పూర్వులు చనిపోయినవారిని యే పార్వతీ పరమేశ్వరుల చేతో, సిద్ధుల చేతో బ్రతికించి కథలను సుఖాంతం చేసేవారు.

పాశ్చాత్యుల పద్ధతి మనకి పూర్తిగా విరుద్ధం. సుఖాంతమైన కథలు చప్పగా వుంటాయిట. కథ రక్తికట్టదుట. దుఃఖాంతమైనకథే అసలైనకథట. వారి పద్ధతి ఇంగ్లీషు సంస్కారం పొందిన మన భారతీయులందరికీ నచ్చడం ప్రారంభమై క్రమంగా సామాన్య ప్రజానీకపు అభిరుచిగా అయిపోయింది. ఈ రోజులలో అన్నీ దుఃఖాంతమైన కథలేగాని సుఖాంతమైన కథలు మచ్చుకైనా వున్నాయా ? కాక, ప్రజల్ని యేడిపించినంత సులువుగా నవ్వించలేం."

"పాశ్చాత్యుల పద్ధతిగా వ్రాయడం కోసం వెన్నలాంటి హృదయాన్ని వజ్రహృదయం చేసుకుంటావా ? పత్రికా రచయితలంటే చాలా మంచివారనీ, ఒరుల బాధ లర్థం చేసుకునే శక్తివారి కున్నదనీ అనుకునేవాడిని. ఇంత ఘోరంగా బాధించి వాళ్ల బ్రతుకు భారం చేసేవాళ్లని యెన్నడూ అనుకోలేదు. మీకన్న గవర్నమెంటువారే నయం. ఇటీవల మా N. G. Oల బిడ్డలకు వుచితంగా విద్య గరపడానికి యేర్పాటు చేశారు."




చదవండి ! తెనుగు మాస పత్రిక
జయభారత్

ఆ మూర్ఖత చూస్తే అసహ్యం వేసింది. గట్టిగా చివాట్లేస్తే కానీ ఒడిలే ఘటంలా కనిపించలేదు అందుచేత యిలా అన్నాను "ఏనాటనుండో కవులు వ్రాస్తున్నారు. వారి రచనలలో నమ్మగలిగినవీ, నమ్మలేనివీ కూడా వున్నాయి. "వజ్రాయుధంతో ఇంద్రుడు పర్వతాల రెక్కలు విరగ్గొట్టాడు" అని పురాణాల్లో వుంది. ఇంద్రుడు వచ్చి "నేను పర్వతాల రెక్కలు విరగ్గొట్టానా? నాకీ అపకీర్తి తెచ్చి పెట్టావేమిటి?" అని అడిగాడా వ్రాసినవారిని? పర్వతాలు వచ్చి "మాకు రెక్కలెక్కడివి? భూమితో అంటుకుపోయివున్న మేము యెల్లా యెగురగలం?" అని అడిగాయా? దీక్షితులు, మునిమాణిక్యం, కుటుంబరావు లాంటివారు సుమారు పాతికముప్ఫైయేళ్ళనుండి రచనలు చేస్తూ నేవున్నారే! ఎన్నెన్నికథలు వ్రాశారు! వారి కథలలోని పాత్రలను వారు పెట్టని కష్టాలున్నాయా! చెయ్యని హాస్యముందా! ఎన్నడైనా యేపాత్రయినా వారిని దండించిన పాపాన పోలేదు సరికదా కనబడనైనా లేదే? వారంటే భయంచేత కాబోలు క్రొత్తగా బయలుదేరిన రచయితలమనేనా మేమంటే యీ లోకువ? లేకపోతే యిలాంటి విడ్డూరం యెన్నడైనా యెరుగుదుమా! కథ రక్తికట్టడానికి అనేక కల్పనలుచేస్తాం. రచయితలను వారికథలలోని పాత్రలు వచ్చి నిలదీసి అడుగుతుంటే వారికి కాగితంమీద కలం నడుస్తుందా!" గొప్పగా అన్నాననుకున్నాను.

"ఇంత అస్వాభావికమైన కథలు వ్రాయకపోతేయేం? ఎవడేడ్చాడు?" అన్నాడు అంతా విని.

నా మనస్సు చివుక్కుమంది. అయినా నా భావాన్ని పైకి కనబడనివ్వలేదు. "పిల్లలపత్రికలు, పెద్దలపత్రికలు, స్త్రీలపత్రికలు, పురుషులపత్రికలు అనేకం బయలుదేరాయి. అవన్నీ నిండవద్దా. ఏ కల్పనా చెయ్యకుండా రచయితలు యథార్థ విషయం వ్రాస్తే చదువరులకు రోతపుడుతుంది. అదీగాక నాకథ అస్వాభావికమైనది కాదే! నా కథలోని ఆరుద్రగం అయ్యరులాంటి వాళ్లు మధ్యతరగతి కుటుంబాలలో కనబడుతూనే వుంటారు" అన్నాను.

"ఎయ్యి చెప్పు. లక్ష చెప్పు, నీ కథ దారుణంగావుంది. పిల్లలు గలవాళ్లు యిలాంటి వ్రాతలు వ్రాయవచ్చా?" అనిఅడిగాడు.

"ఈ ప్రశ్న చాలా చిత్రంగా వుంది పిల్లలకీ, పత్రికారచనకీ సంబంధం యేమిటి?"

"పిల్లలు కలవాళ్లెంతసేపూ నవ్వు పుట్టించేవి, భక్తిరస ప్రధానమైనవి, నీతిబోధకములైన వ్రాతలు వ్రాయాలి. మంచివి వ్రాస్తే మంచీ, చెడ్డవివ్రాస్తే చెడుగూ కలుగుతుంది. ఆ విషయం చెబుదామనే వచ్చాను" అన్నాడు.

"ఎంతమంది రచయితలు ఎన్నిరకాల కథలు, వ్యాసాలు, పద్యాలు వ్రాయడం లేదు? ఎవరికైనా ఆపద వచ్చిందని అనుకోవడం విన్నామా? నీ చాదస్తంగాని మరేం ఫరవాలేదు," అన్నాను నవ్వుతూ.

"వ్రాస్తే వ్రాశావు కాని పత్రికకు పంపడానికి యెంతమాత్రం వీల్లేదు" అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టు.

"పంపితీరతాను. నే నీ కథ వ్రాసింది పత్రికకు పంపడానికే" అన్నానుఒళ్లుమండి.

"అల్లాగేం? నీకథ అచ్చుపడనీ యేంచేస్తానో చూద్దువుగాని. నే నెలాంటివాడినో యెరక్క అల్లా మాట్లాడుతున్నావు. నేను పెద్దమనుషులలో పెద్దమనిషినీ, రౌడీలలో రౌడీని. జాగ్రత్త" అని కళ్ళవెంట నిప్పులు రాలుస్తూ వెళ్ళిపోయాడు.

ఆ ముఖం చూసేటప్పటికి నా కేమిటో చెప్పలేని భయంవేసింది. నా వొంట్లోని ప్రతీనరం వొణుకుతున్నట్టనిపించింది. పత్రికకు పంపుతానని అంత తెగేసి చెప్పిన నాకు ఆ కథను పంపడానికి మనస్కరించలేదు. గాలికి టపటప కొట్టుకుంటున్న కాగితాలని ముక్కలుగా చింపేసి నలిపి చెత్తబుట్టలో పారేసి "అమ్మయ్య" అనుకున్నాను. మనస్సెంతో తేలిక పడ్డట్టయింది.

*        *        *        *

పిల్లల కేకలతో మెలుకువ వచ్చింది. నాకథ కాగితాలను చింపి పడవలు కడుతున్నారు నా కాళ్లదగ్గర కూర్చుని గాబాబూ, లక్ష్మీ.


# స్వాతంత్ర్య దినమునకు ప్రత్యేక కానుక.

## రు. 55,125

రిజిస్టర్డు నెం. 5025

### అన్నీ సరియైన 21 బహుమతులకు పంచిపెట్టబడును.

అన్ని బహుమతులు గ్యారంటీ చేయబడినవి

| | | |
|---|---|---|
| అంతా సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 2625 లు |
| మొదటి రెండు వరసలు సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 625 లు |
| మొదటి ఒకవరస సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 55 లు |
| a, b or a, c సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 25 లు |

| | | | |
|---|---|---|---|
| a | b | | |
| c | | | |
| | | | |
| | | | |

ఇచ్చట చూపిన చదరంలో 4 నుండి 19 వరకు అంకెలు వాడి నిలువుగగాని, అడ్డముగగాని, అయిమూలలుగా గాని ఎటు కూడినను మొత్తం 46 వచ్చునట్లు చేయవలెను. ఒకసంఖ్య ఒకసారే వాడవలెను.

ఆఖరు పోస్టింగు తేది 11-8-52. ఫలితము 22-8-52

ప్రవేశరుసుము ఒక ఎంట్రీ రు. 1/-;

4 ఎంట్రీలు రు. 3/-లు, 8 ఎంట్రీల ప్రతిసెట్టు రు. 5/-లు

గతపోటీ ఫలితం

| | | | |
|---|---|---|---|
| 4 | 10 | 13 | 15 |
| 11 | 17 | 6 | 8 |
| 18 | 12 | 7 | 5 |
| 9 | 3 | 16 | 14 |

మొత్తం 42

రూల్సు: పై రేటువంతున రుసుముతో సాదా కాగితం మీద ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును. రుసుము మనియార్డరు ద్వారా గాని పోస్టల్ ఆర్డరు ద్వారాగాని, బ్యాంకుడ్రాఫ్టు ద్వారాగాని పంపవలెను. ఎంట్రీలు రిజిస్టరు కవరులో పంపితే మంచిది ఢిల్లీలో ఒక పెద్ద బ్యాంకులో డిపాజిటుచేసిన సీల్డుసొల్యూషనుతో, లేక దానివరుసలతో సరిపోలియుండు సొల్యూషను లేక వరుసలు మాత్రమే సరియైనవిగా ఎంచబడును. సొల్యూషనులో ఇంగ్లీషు అంకెలు మాత్రమే వాడండి. పై బహుమతి మొత్తము రు. 55,125/-లు మాకు చేరిన అంతా సరైన సొల్యూషనుల సంఖ్యను బట్టి మారును, కాని గ్యారంటీ చేయబడిన బహుమతులు మారవు. ఫలితములకుగాను ఎంట్రీలతో స్వంత అడ్రసు వ్రాసి బిళ్ళ అంటించిన కవరు పంపవలెను. మానేజరు తీర్పు ఖాయముగాను లాప్రకారము బద్ధమైనదిగాను వుండును. మీ ఎంట్రీలు రుసుములు దిగువ అడ్రెసుకు పంపండి.

**Maya Distributors(43)Reged. P. B. 73 A.558, Chandni Chowk. Delhi**